సాక్షి
నంద్యాల
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్యకళావేదికపై శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన నిహారిక బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.



భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి పూజలు జరిపించారు.



మద్యం డంపులపై ప్రత్యేక నిఘా

మద్యం డంపులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సెబ్ జోనల్ డిప్యూటీ కమిషనర్ టి. విజయశేఖర్ ఆదేశించారు. చెక్ పోస్టులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

శ్రీ చౌడేశ్వరిదేవికి సారె సమర్పణ



అమ్మవారికి సారె తీసుకొస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ అర్చకులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పడమటి కాలనీలో ఉన్న కలశ గది నుంచి అమ్మ వారికి తొగటవీర క్షత్రియులు, బ్రాహ్మణులు, కలశం, పసుప, కుంకుమ, పూలు, గాజులు చీర, రవిక, బోనం, ఒడిబియ్యం తదితర పూజ వస్తువులను మేళతాళాలతో అమ్మ వారి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన తదితర పూజలు చేసి తమ మొక్కుబడులు చెల్లించారు. సాయంత్రం ధర్మవరానికి చెందిన శ్రీ అభయహస్త సేవా సమితి వారు చేపట్టిన అన్నమయ్య సంకీర్తన భక్తులను అలరించింది.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఉపకులపతి శారదా జయలక్ష్మి

నంద్యాల(సెంట్రల్): ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నూతన సాంకేతికతను అభివృద్ధి పరచడంలో, సాగుకు సంబంధించి కొత్త ఆవిష్కరణలు రూపొందించే విధంగా కృషి చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాయం ఉపకులపతి డాక్టర్ శారదా జయలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం పరిశోధన స్థానం సమావేశ మందిరంలో సహసంచాలకురాలు సరళమ్మ అధ్యక్షతన శాస్త్రవేత్తలతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత సంవత్సర కాలంలో పరిశోధనల్లో రాబట్టిన ఫలితాలను, సాధించిన ప్రగతిని ఆమెకు వివరించారు. అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ... పరిశోధనల పరంగా విశ్వవిద్యాలయాన్ని దేశంలో అగ్రగామిగా నిలిపేందుకు తగిన ప్రణాళికలు రచించుకోవాలని, పరిశోధన ఫలితాలను క్షేత్రస్థాయిలో రైతులకు చేరే విధంగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కందులు క్వింటా రూ.11,201

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కందుల ధర జోరు మీద ఉంది. శుక్రవారం కందుల ధర మరింత పెరిగింది. కర్నూలు మార్కెట్‌కు 43 మంది రైతులు 128 క్వింటాళ్లు తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.3,102, గరిష్ట ధర రూ.11,201, మధ్య ధర రూ.10,960 నమోదైంది. దాదాపు అన్ని లాట్లకు ధర రూ.10 వేలపైనే లభించడం విశేషం. 2023–24లో పండిన కందులకు ఏడాది పొడవునా ధరలు మెరుగ్గా ఉండటం ఎంతో ఊరటనిచ్చింది. గత ఏడాది వర్షాభావం వల్ల వివిధ పంటల్లో దిగుబడులు పడిపోయాయి. ఈ తరుణంలో ధరలు ఆదుకుంటున్నాయి. గత ఏడాది ఖరీఫ్‌లో పండించిన కందులు రైతుల దగ్గర దాదాపు ఖాళీ అవుతున్నాయి. ఇందువల్ల రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

ఇంటర్‌లో మెరిశారు!

- ఫస్టియర్‌లో 59 శాతం, సెకండియర్‌లో 77 శాతం ఉత్తీర్ణత
- గతేడాది ఫలితాలతో పోలిస్తే పెరిగిన ఉత్తీర్ణత శాతం
- ప్రతిభ చాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు
- ఈ నెల 18నుంచి రీ–కౌంటింగ్, రీ–వెరిఫికేషన్‌కు దరఖాస్తు
- సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 24లోపు ఫీజు చెల్లించాలి
- వచ్చే నెల 24 నుంచి జూన్ 1 వరకు సప్లిమెంటరీ పరీక్షలు



నారాయణ ఆచారి, తెలుగు శ్రావణి, సాయి నితిన్, భువనకృతి, ఎం.వైభవి, లావణ్య, జబీన్

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

మొదటి సంవత్సరం
ఎంపీసీ విభాగం (మొత్తం మార్కులు 470):
మౌనిక 460, జి భాస్కర్ ఆచారి 460, నూర్జాహాన్ 459, వెన్నెల 457, సురేఖబాను 451, సి. మాధవ 446, దీనా కుమారి 443, శ్రావణి 440, నారాయణ ఆచారి 439 తబుసుమ్ 438, చల్లా మధు మోహన్ నాయుడు 436, శిరీష 429 , హేమశ్రీ 427
బైపీసీ విభాగం (మొత్తం మార్కులు 440 మార్కులు).. ఆయేషా 425, మౌనిక 420, గూటుపల్లి సుదర్శన్ 416, రమిజాబీ 405, ఇమ్రాన్ 405, చెరువుపల్లి వైష్ణవి 401

ద్వితీయ సంవత్సరం (మొత్తం మార్కులు 1000)
ఎంపీసీ విభాగం .. సాయినితిన్ 989, వంశీక 988, తేజశ్విని 988, ఎం.వైభవి 987, కార్తీక 970, బి.గురుదేవి 969, జబీన్ 967, అశ్విని 968,
బైపీసీ విభాగం ..
భువనకృతి 981, ఫాతీమా 979, జయసూర్య 977, ఎం.హారిక లీలాంజలి 980, నిరంజన్‌రెడ్డి 970, లావణ్య 969, ప్రవీణ్ 965, రషీద 954

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ విద్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం, జూనియర్ కాలేజీల్లో మౌలిక సదుపాయాల కల్పించడంతో ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు ఆశాజనకంగా వచ్చాయి. గతేడాది ఫలితాలతో పోలిస్తే ఉత్తీర్ణత శాతం కొంత మెరుగుపడింది. గతేడాది ఫస్టియర్‌లో 56 శాతం, సెకండియర్‌లో 66 శాతం ఉత్తీర్ణత కాగా.. ఈ ఏడాది ఫస్టియర్‌లో 59 శాతం, సెకండియర్‌లో 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. శుక్రవారం ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో బాలుర కంటే బాలికలే అత్యధిక శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు జనరల్ విభాగంలో 12,022 మంది విద్యార్థులు హాజరు కాగా 7,102 మంది విద్యార్థులు (59 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,026 విద్యార్థులకు గాను 616 మంది (60 శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ విద్యార్థులు జనరల్ విభాగంలో 9,165 మందికి గాను 6,429 (77 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 801 మందికి గాను 561 (70 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 19వ స్థానంలో నంద్యాల జిల్లా నిలిచింది.

ఏపీ మోడల్ స్కూళ్లలో..
జిల్లాలో 19 ఏపీ మోడల్ స్కూల్స్ ఉన్నాయి. మొదటి సంవత్సర ఫలితాల్లో 1,097 మందికి గాను 663 మంది (60.44 శాతం), ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 889 మందికి గాను 646 మంది (77.67 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం మిడుతూరు మోడల్ స్కూల్‌లో 91.8 శాతం సాధించగా, అతి తక్కువలో ఉయ్యాలవాడ మోడల్ స్కూల్‌లో 33.3 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

సంవత్సరం	విభాగం	హాజరైన వారు	ఉత్తీర్ణులైనవారు	శాతం
ఫస్టియర్	జనరల్	12,022	7,102	59
	ఒకేషనల్	1,026	616	60
సెకండియర్	జనరల్	9,165	6,429	77
	ఒకేషనల్	801	561	70

కేజీబీవీలో...
జిల్లాలో 27 కేజీబీవీ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. మొదటి సంవత్సరంలో 436 మంది విద్యార్థులకు గాను 239 మంది (55 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 460 మందికి గాను 313 మంది (68 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం అత్యధికంగా గోస్పాడు కేజీబీవీ పాఠశాల 100 శాతం ఫలితాలు సాధించగా, సంజామల కేజీబీవీ కళాశాల అతి తక్కువ 13.6 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో...
జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీలకు చెందిన విద్యార్థులు మొదటి సంవత్సరంలో 1,677 మందికి గాను 764 (45.56 శాతం), ద్వితీయ సంవత్సరంలో 1,039 మందికి గాను 674 (44.87 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం అత్యధికంగా గోస్పాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల 85.7 శాతం, అతి తక్కువ డోన్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ 18.8 శాతం సాధించారు.

రెసిడెన్షియల్ కాలేజీల్లో..
జిల్లాలో ఆరు సోషల్ వెల్ఫేర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఫస్ట్ ఇయర్‌లో 356 మందికి గాను, 312 మంది (87.64 శాతం) ఉత్తీర్ణులైయ్యారు. సెకండ్ ఇయర్‌లో 381 కిగాను 48 మంది(91 శాతం) ఉత్తీర్ణులైయ్యారు. మొదటి సంవత్సరం అత్యధికంగా లక్ష్మాపురం ఏపీఎస్ డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో 97.1 శాతం కాగా, అత్యల్పంగా ఆళ్లగడ్డ బాలికల కళాశాల 76.6శాతం సాధించారు.

➢ ఒకేషనల్ 9 ప్రభుత్వ కళాశాలల్లో 394 మందికి గాను 249 మంది (58 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే రెండో సంవత్సరం 314 మంది విద్యార్థులకు గాను 208 మంది (66.24 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

➢ జిల్లాలో మూడు బీసీ వెల్ఫేర్ కళాశాలలో మొదటి సంవత్సరం 174 మందికి గాను 149 మంది (85 శాతం) ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం 96 మందికి గాను 95 మంది (99 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం అత్యధికంగా నెరవాడ ఎంజేపీఏ పీబీసీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల 99.1 శాతం కాగా, అతితక్కువ డోన్ బాలికల కాలేజీలో 48.0 శాతం సాధించారు.

➢ ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ మూడు కళాశాలల్లో మొదటి సంవత్సరం 217 మందికి గాను 194 మంది విద్యార్థులు (89 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే రెండో సంవత్సరం 177కు గాను 171 మంది (97 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో అత్యధికంగా శ్రీశైలం ఏపీటీడబ్ల్యూఆర్ కళాశాల 94.7 శాతం కాగా, అతి తక్కువలో శ్రీశైలం బాలుర కళాశాల 70.4 శాతం సాధించారు.

రీకౌంటింగ్‌కు అవకాశం
ఇంటర్ ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చినవారు, వచ్చిన మార్కులపై అనుమానమున్న వారు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించారు. రీకౌంటింగ్‌కి ఒక్కో పేపర్‌కు రూ.250, రీవెరిఫికేషన్‌తో పాటు, స్కాన్ చేసిన సమాధాన పత్రానికి ఒక్కో సబ్జెక్టుకు రూ.1300 చెల్లించాలి. ఇందుకు ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలి. సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 24వ తేదీ లోపు పరీక్ష ఫీజులు చెల్లించాలి. ఈ పరీక్షలు వచ్చే నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉదయం , మధ్యాహ్నం వేళల్లో జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షల్లో ఫెయిల్ అయినవారికి వచ్చే నెల 1 నుంచి 4వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.



జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో ఫస్టియర్‌లో 98 శాతం, సెకండియర్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తి అభినందించారు.

ఇంజనీర్ కావాలని ఉంది



మా తల్లిదండ్రులు ఎల్లయ్య, సుబ్బలక్ష్మి నర్సాపురం గ్రామంలో వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. కష్టపడి చదివించిన వారి రుణాన్ని ఇంజనీర్ అయి తీర్చుకుంటా. 969 మార్కులు సాధించడం ఆనందంగా ఉంది.
– గురుదేవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆళ్లగడ్డ

డాక్టర్‌గా పేదలకు సేవలు అందిస్తా



నీట్ రాసి ర్యాంకు ద్వారా ఎంబీబీఎస్ డాక్టర్ వృత్తి చేపట్టాలని ఉంది. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించి సమాజ శ్రేయస్సుకు పాటు పడతా. 980 మార్కులు సాధించేందుకు కళాశాల అధ్యాపకులు చేసిన కృషి అమోఘం. తల్లిదండ్రుల ప్రోత్సాహం. ప్రణాళికతో చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చు.
– హారికలీలాంజలి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నంద్యాల

ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



కలెక్టర్ చాంబర్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్స్ ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీలు



వీవీ ప్యాట్స్‌ను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. డీఆర్‌ఓ పద్మజ, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఈవీఎంల నోడల్ అధికారి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచించిన సాఫ్ట్‌వేర్ ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డీఈఓ లాగిన్ నుంచి ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో ఈ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. తొలుత నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గ స్థానానికి సంబంధించి, అనంతరం జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ చేపట్టి పూర్తి చేశామన్నారు. రెండవ దశ సంబంధిత రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. అనంతరం టెక్కె మార్కెట్ యార్డులో ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌లో నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు, వీవీప్యాట్స్ యంత్రాలను కేటాయించి సంబంధిత నియోజకవర్గాలకు తరలిస్తామన్నారు. తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని, సెక్యూరిటీ ప్రొటోకాల్ ప్రకారం పటిష్ట పోలీస్ బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు వాటిని చేరవేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియలో వైఎస్సార్సీపీ తరఫున అనిల్ అమృతరాజు, సాయిరాంరెడ్డి, బీజేపీ తరఫున కొట్టె చంద్రశేఖర్, నాగ శివ సాయి, కాంగ్రెస్ పార్టీ తరఫున సయ్యద్ రియాజ్ బాషా, టీడీపీ తరఫున శివరాం రెడ్డి, వైవీ రామిరెడ్డి, సీపీఐ(ఎం) తరఫున పూల నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయం.. ప్రలోభాల పర్వం

- బరితెగిస్తున్న తెలుగుదేశం నాయకులు
- ఓటర్లకు తాయిలాలు ఎర వేస్తున్న వైనం
- కేసులు నమోదు చేస్తున్న లెక్కచేయని నేతలు
- బీసీ జనార్దన్ రెడ్డి, బైరెడ్డి శబరి, కోట్లపై ఫిర్యాదులు



డోన్‌లోని ఓ ఈద్‌గాలో ఓటర్లను ప్రలోభపెడుతున్న కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి (ఫైల్)



నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో ఓటర్లకు పంచేందుకు సిద్ధం చేసిన పెన్నులపై చంద్రబాబు, టీడీపీ సింబల్ ఉన్న దృశ్యం



బనగానపల్లెలోని ఓ మసీదులో దుస్తులు, నగదు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)

సాక్షి, నంద్యాల: అధికార పార్టీ వైఎస్సార్‌సీపీ ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్నే ప్రధానాస్త్రంగా చేసుకుని ఎన్నికల బరిలో దూసుకెళ్తుండగా.. ప్రతిపక్ష పార్టీ టీడీపీ మాత్రం ఓటమి భయంతో ప్రలోభాల పర్వానికి తెరతీసింది. 'మా పాలనలో మంచి జరిగితేనే మాకు ఓటేయండి' అంటూ అధికార పార్టీ నేతలు ఓటర్లకు విన్నవిస్తుంటే.. టీడీపీ నేతలు మాత్రం అబద్ధపు హామీలు, తాయిళాలతో మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. నంద్యాల జిల్లాలో బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీని ఢీకొట్టేందుకు కూటమి నేతలు కుయుక్తులు పన్నుతున్నారు. తమ మేనిఫెస్టోలోని పథకాలను ఓటర్లు పట్టించుకోవడం లేదన్న విషయాన్ని గ్రహించిన పచ్చ పార్టీ నేతలు ప్రలోభాలకు తెరతీశారు. ఓటర్లను ప్రలోభపెట్టడంలో నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి ముందువరుసలో ఉన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం మైనారిటీ మహిళలకు చీరలు, పురుషులకు ప్యాంటు, షర్ట్ క్లాత్‌లతో పాటు డబ్బులను పంపిణీ చేశారు. దీనిపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. బనగానపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి ఉల్లంఘనలకు అవధులే లేకుండా పోతున్నాయి. ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డదారులనే ఆయన ఎంచుకున్నారు. టీడీపీ రంగు, లోగోలున్న ట్యాంకర్లను నీటిని సరఫరా చేస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. రంజాన్ పండుగ సందర్భంగా ఏప్రిల్ 9న బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మసీదుల్లోని ఇమాంమ్‌లకు దుస్తులు, నగదును భారీ ఎత్తున పంపిణీ చేశారు. దీనిపై ఇప్పటికే ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు అందాయి. తాజాగా కేంద్ర మాజీ మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు. వాస్తవానికి గుడి, బడి, మసీదుల వద్ద ఎన్నికల ప్రచారం చేయకూడదు. కానీ, రంజాన్ పండుగ సందర్భంగా ఆయన మసీదులకు వెళ్లి అక్కడి ముస్లింలకు మజ్జిగ, కర్జూరాలతో పాటు నగదును పంపిణీ చేశారు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా శుక్రవారం నందికొట్కూరులో టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. పెన్నులపై చంద్రబాబు ఫొటో, ఆ పార్టీ సింబల్‌ను ముద్రించి వాటిని ఓటర్లను పంచుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్నారు. ఎవరు ఎక్కడ కనిపించినా చేతికి పెన్ను ఇచ్చి మన గుర్తు గుర్తించుకోండని ఓటర్లను కోరుతున్నారు. పెన్నుల పంపిణీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లువెత్తుతున్నాయి.

కేసులు నమోదు చేస్తున్నా బరితెగింపు..
తమ మేనిఫెస్టోను ఓటర్లు పట్టించుకోవడం లేదని ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చిన జిల్లా తెలుగుదేశం నాయకులు డబ్బులతో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమవుతున్నారు. డబ్బులతో రాజకీయాన్ని శాసించాలని చూస్తున్నారు. పచ్చనేతల కుయుక్తులను, కుట్రలను ఎలక్షన్ కమిషన్ అడ్డుకుంటున్నా వారిలో ఏమాత్రం చలనం కనిపించడం లేదు. జిల్లాలో ఎన్నికల నియమావళిని టీడీపీ అభ్యర్థులు పదే పదే ఉల్లంఘిస్తున్నారు. వీడియోలు, ఫొటోల ఆధారంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. కానీ, తాము అన్నింటికి అతీతులమన్నట్లు వారి ప్రవర్తన ఉంటోంది.

వివరాలు చెప్పండి.. అఖిలమ్మ అడగమంది!

- ఓటర్లకు ఎర వేస్తున్న ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి
- ఇంటింటా వివరాలు ఆరా తీస్తున్న వైనం
- ఫోన్, బ్యాంక్ నంబర్లు సేకరణ
- పార్టీలో ప్రాధాన్యత కల్పిస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులకు ఫోన్ కాల్స్
- తిప్పికొడుతున్న అధికార పార్టీ నేతలు

ఆళ్లగడ్డ: ఓటమి భయంతో ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిని భూమా అఖిలప్రియ ఓటర్లకు ఎర వేసేందుకు యత్నిస్తున్నారు. ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభపెట్టి.. కులాల మధ్య కుంపటి రాజేసి గెలుపొందాలని కుటిల ప్రయత్నం చేస్తున్నారు. అవినీతి, అక్రమాలు, భూకబ్జాల ద్వారా సంపాదించిన డబ్బులతో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు అధికార పార్టీ వైపు ఉన్నారనే సమాచారంతో ఆపార్టీ నేతలు, కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేయాలనే ప్రయత్నంలో దిగజారి రాజకీయాలు చేస్తున్నారు. టీడీపీ నేతలు గ్రామాలు, వార్డులను ఎంచుకుని ఇంటింటికి తిరిగి ఫోన్ నంబర్లతో సహా వివరాలు సేకరిస్తున్నారు. వాటిని అఖిలప్రియ భర్త భార్గవ రామ్‌కు అందజేస్తున్నారు. ఆయన నాయకులకు ఫోన్ చేసి నగదు ఆశ చూపడమే కాక 'పెత్తనం మీదేనంటూ' నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. అయితే గ్రామాల్లో ఎంతో బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ ప్రలోభాలుక లొంగకుండా ధీటుగా సమాధానం చెబుతున్నారు. చాగలమర్రి, రుద్రవరం మండలాల పరిధిలోని సీనియర్ నాయకులకు ఇదే తరహాలో ఫోన్ వస్తే చాలా మంది ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఫోన్ కట్ చేసిన ఘటనలు ఇటీవల చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సొంత మండలమైన రుద్రవరాన్ని టీడీపీ నాయకులు టార్గెట్ చేసి ప్రలోభాల పర్వానికి తెరతీశారని తెలుస్తోంది. మండల కేంద్రం రుద్రవరానికి చెందిన బలిజ సంఘం నాయకుడు అఖిలప్రియ భర్తతో కలిసి వైఎస్సార్‌సీపీకి చెందిన బలిజ నేతలే లక్ష్యంగా నిత్యం ప్రలోభాలకు గురిచేస్తున్నారని తెలుస్తోంది. తమ పార్టీలోకి వస్తే పెత్తనం అంతా మీదే అని ఖర్చులకు నగదు కూడా ఇస్తామని అఖిలప్రియ భర్త భార్గవరామ్ నేరుగా ప్రలోభపెడుతున్నారని సమచారం.



ఆళ్లగడ్డలో అనధికారికంగా ఇంటింటికి తిరుగుతూ ఓటర్ల వివరాలు సేకరిస్తున్న టీడీపీ నాయకులు

ఎన్నికల నియమావళి ఉల్లంఘనే..
అనుమతి లేకుండా టీడీపీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ఇంట్లో ఎంతమంది ఉన్నారు. ఏం పనిచేస్తారు. ఏ కులం, ఏ పార్టీకి ఓటు వేస్తారని వివరాలు అడగటంతో పాటు ఫోన్ నంబర్, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు కూడా సేకరించి ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం ముమ్మాటికీ ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది మంది టీడీపీ కార్యకర్తలు ఓటర్ల వివరాలతో పాటు ఇంటి పెద్ద ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓట్లు అడిగితే తప్పులేదని ప్రలోభాలకు గురిచేయడం, వ్యక్తిగత వివరాలు సేకరించే వ్యక్తులపై ఆధారాలు తమకు సమర్పిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

ఎందుకు అంటే ఏమి చెప్పడం లేదు



టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు మా ఇంటితో పాటు చుట్టూ ఉన్న వాళ్ల ఇళ్ల దగ్గరకు వచ్చి మీ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయి? ఎంతమంది ఉన్నారు? ఏం పనిచేస్తున్నారు? మీరు ఏ పార్టీ.. అంటూ వివరాలు అడిగి విషయాలు రాసుకున్నారు. ఫోన్ నంబర్లతో పాటు కొందరి బ్యాంక్ అకౌంట్ కూడా అడిగి రాసుకున్నారు. ఎందుకు అంటే అఖిలమ్మ రాసుకు రమ్మంది అంటున్నారు. అంతకంటే ఏమీ చెప్పడం లేదు.
– నజీర్, రహిమాన్ వీధి, ఆళ్లగడ్డ

క్లుప్తంగా

14,15 తేదీల్లో వైద్య పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల విధుల మినహాయింపుకోరే ఉద్యోగులకు ఈ నెల 14,15 తేదీల్లో వైద్యపరీక్షలను నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల మినహాయింపు కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఆయా తేదీల్లో బీక్యాంపులోని సివిల్ డిస్పెన్సరీలో పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు హాజరైన వారికి మాత్రమే మినహాయింపు ఇస్తామని ఆమె వివరించారు.

రూ.1.29 లక్షలు పట్టివేత

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీలో రూ.1.29 లక్షల నగదును పోలీసులు సీజ్ చేశారు. శుక్రవారం ఆళ్లగడ్డ మండలం పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన లక్కీశెట్టి సత్యనారాయణ మినీ గూడ్స్ వాహనంలో వెళ్తుండగా వాహనాన్ని తనిఖీ చేశారు. హిందూస్థాన్ కంపెనీకి చెందిన సరుకులు ఉన్నాయి. అలాగే సత్యనారాయణ వద్ద కవర్‌లో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 1,29,850 నగదు ఉండటాన్ని గుర్తించారు. పంచనామా నిర్వహించి నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

రూ.1.95 లక్షలు సీజ్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.1.95 లక్షల నగదును శుక్రవారం సాయంత్రం ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులు ఎలాంటి బిల్లులు లేకుండా బైక్‌పై నగదు తీసుకొని వెళ్తుండగా తనిఖీ చేశారు. సీజ్ చేసిన నగదును వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. నగదును సరైన పత్రాలు చూపించి తీసుకెళ్లాలని సీఐ చలపతి సూచించారు.

మహానంది దేవస్థాన ఉద్యోగి నిజాయితీ



పర్సును భక్తుడికి అప్పగిస్తున్న ఏఈఓ వేంకటేశ్వరుడు

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన ఓ భక్తుడు శుక్రవారం కోనేరులో స్నానం చేస్తుండగా తన లోదుస్తుల్లో ఉన్న పర్సు పడిపోయింది. అదే సమయంలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు వచ్చిన దేవస్థానం ఉద్యోగి భజంత్రీ భూపాల్ పర్సును గమనించి బయటికి తీసి చూడగా రూ. 4,500 నగదు ఉంది. దీంతో ఏఈఓ వేంకటేశ్వరుడు దృష్టికి తీసుకెళ్లగా మైకుల్లో అనౌన్స్ చేయించి అప్పగించారు. దీంతో పాటు కర్నూలుకు చెందిన శ్రీనివాసగౌడ్, కుటుంబ సభ్యులు శుక్రవారం మహానందికి వచ్చారు. ఈ మేరకు వారిలో ఒకరు స్నానం చేస్తూ కాలికి ఉన్న వెండిపట్టీని పోగొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఏఈఓ ఓంకారం వేంకటేశ్వర్లు స్థానిక చెంచు యువకుల చేత వెతికించి ఏఎస్‌ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ శేషన్నల సమక్షంలో అప్పగించారు.

కవరు కట్టి.. నాణ్యత రాబట్టి!

పెరుగుతున్న ఫ్రూట్ కవర్ల వినియోగం

- వంద శాతం నాణ్యతను పెంపొందించుకునే అవకాశం
- విదేశాలకు సైతం ఎగుమతి చేసే నాణ్యత
- మామిడితో సహా దానిమ్మ, జామ, డ్రాగెన్‌ఫ్రూట్స్‌కు అనుకూలం
- అధిక ఉష్ణోగ్రతలతో ఈ సారి రాలిన పూత, పిందె
- ఈ నేపథ్యంలో నాణ్యతపై రైతుల దృష్టి

250 చెట్లకు ఫ్రూట్ కవర్లు



40 ఎకరాల్లో 2,500 మామిడి చెట్లు సాగు చేస్తున్నాం. ఈ సారి పూత ఆశాజనకంగా ఉన్నప్పటికీ అధిక ఉష్ణోగ్రతల వల్ల రాలిపోయింది. గత ఏడాది మామిడికి 10వేల పేపరు సంచులను వినియోగించాం. ఈసారి బేనిసా రకాలు, కాపు బాగా ఉన్న 250 చెట్లకు ఫ్రూట్ కవర్లు వినియోగిస్తున్నాం. ప్రస్తుతం వీటిని కాయలకు కడుతున్నాం. ఈ చెట్లు మేలో కటింగ్‌కు వస్తాయి. ఫ్రూట్ కవరు కట్టిన ప్రతి కాయలో నాణ్యత కనిపిస్తుంది. మామిడికి ముఖ్యంగా పండుఈగ బెడద అధికం. పేపరు సంచులను మామిడి నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడే కడితే పండుఈగ బెడద ఉండదు. ఎండ తగలదు. జీడి కారదు. ఎలాంటి మచ్చలు ఉండవు. నాణ్యత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. – జి.శ్రీరాములు, ఉద్యాన రైతు, గూడూరు

కర్నూలు(అగ్రికల్చర్): పండ్లలో నాణ్యత ప్రమాణాలను పెంపొందించడం, తద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే దిశగా ఉద్యాన శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో మామిడి, జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్ తదితర పండ్ల తోటలు విస్తృతంగా సాగవుతున్నాయి. వీటిలో చెక్కగుజ్జుతో తయారైన పేపరు సంచులను వినియోగించడం ద్వారా నాణ్యమైన ఫలసాయం పొందే వీలుంది. పేపరు సంచులను కాయలకు గాలి చొరబడకుండా కడితే 100 శాతం నాణ్యతను పెంపొందించుకున్నట్లే. వీటిపై ఉద్యాన శాఖ విస్తృత అవగాహన కల్పిస్తోంది. జిల్లాలో మామిడి తోటలు దాదాపు 10 వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. ప్రస్తుతం మామిడి చెట్లు కాయలతో ఉన్నాయి. ఈ పేపరు సంచుల ద్వారా పండించిన పండ్లు విదేశాలకు ఎగుమతి చేసే నాణ్యతతో ఉంటాయని చెబుతున్నారు. గత ఏడాది అనేక మంది రైతులు ఫ్రూట్ కవర్లు వినియోగించి మామిడిలో నాణ్యతను పెంచుకొని అధిక ధరలను పొందడం విశేషం.

దిగుబడులు తగ్గినప్పుడు ఫ్రూట్ కవర్ల వినియోగం

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు మామిడిపై తీవ్ర దుష్ప్రభావం చూపాయి. మొదట్లో పూత, పిందె బాగున్నా.. అధిక ఉష్ణోగ్రతలు మామిడి రైతుల ఆశలను రాల్చేశాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెల మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు 38–39 డిగ్రీలకు చేరాయి. ఇప్పటికే గరిష్ఠంగా దాదాపు 46 డిగ్రీలకు ఎండల తీవ్రత చేరింది. అధిక ఉష్ణోగ్రతల వల్ల రైతుల కళ్లముందే 60–70 శాతం పూత, పిందె రాలిపోయింది. ఈ పరిస్థితుల్లో అంతంత మాత్రం దిగుబడులను కాపాడుకోవడంతో పాటు నాణ్యతను పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇందుకోసం ఫ్రూట్ కవర్ల వినియోగం ఊరటనిచ్చింది.



గూడూరు మండలంలో మామిడికి ఫ్రూట్ కవర్లు వినియోగించిన దృశ్యం

ఏఏ పండ్లకు వాడవచ్చు..

- జామలో థైవాన్ గోవా పిందె ఏర్పడిన 20–25 రోజుల తర్వాత ఒక్కొక్క పిందెకు ఒక్కొక్క తెల్లరంగు సంచి వాడాలి. 60 రోజుల తర్వాత కాయలను కోయవచ్చు.
- దానిమ్మలో పిందె ఏర్పడిన తర్వాత ఒక్కొక్క పిందెకు ఒక్కో తెల్లరంగు సంచి వాడాలి. 90 రోజుల తర్వాత కాయలను కోయాలి.
- ద్రాక్షలో గుత్తులు ఏర్పడిన 60 రోజుల తర్వాత ఒక్కో గుత్తికి ఒక్కో తెల్లరంగు సంచిని వినియోగించాలి. 50 రోజుల తర్వాత గుత్తులను కోసుకోవాలి.

పురుగుల నుంచి రక్షణ

ఫ్రూట్ కవర్ వినియోగంతో మంగు, మచ్చలు, మంచుపురుగు, ముడ్డిపుచ్చు, టెంక పురుగు, మకరం, ఈగలు మొదలగు వాటిని నియంత్రించి నాణ్యమైన పండ్ల దిగుబడికి తోడ్పడుతుంది. పిందె దశలో అంటే నిమ్మకాయ, కోడిగుడ్డు పరిమాణంలో ఉన్నప్పుడు వాడాలి. మంచి పలక పిందెలను సంచిలో పెట్టి మూడు సెంటీమీటర్లపైన తొడిమకు, సంచికి ఉండే తీగను గాలి చొరబడకుండా కట్టాలి.

ఎన్నో ఉపయోగాలు

చెక్కగుజ్జుతో తయారైన పేపరు కాయకు మంచి లక్షణాలు కలిగిస్తుంది. చెడు లక్షణాలను తొలగిస్తుంది. ఈ పేపర్ సంచి ఉండటం వల్ల ఎలాంటి క్రిమికీటకాలు పండ్లను నాశనం చేయకుండా కాపాడుతుంది.

- ప్రత్యేకంగా పండ్లను కాపాడుకునేందుకు ఎలాంటి పురుగుమందులు వాడనవసరం లేదు. అధిక సూర్యరశ్మితో పాటు వడగండ్ల వానల నుంచి కాపాడుకోవచ్చు.
- కాయకు ఉండే సహజ లక్షణాలను పెంపొందిస్తుంది. తొడిమ దృఢంగా తయారై కాయ పరిమాణాన్ని పెంచుతుంది. సహజ రంగును కూడా కాపాడుతుంది.
- తక్కువ కాలంలోనే పెరుగుదల సామర్థ్యాన్ని పెంచి అధిక దిగుబడులను ఇస్తుంది. ఎక్కువ రోజులు పండు పాడవకుండా నిల్వ ఉంటుంది.

కవర్ల వినియోగంతో వంద శాతం నాణ్యత

ఫ్రూట్ కవర్లను మామిడి సహా వివిధ పండ్ల సాగులో వినియోగించవచ్చు. వీటి వల్ల వంద శాతం నాణ్యత ఉంటుంది. గాలి చొరబడకుండా కడితే ఎలాంటి చీడపీడలు లేని ఆరోగ్యవంతమైన కాయలు పండించుకోవచ్చు. విదేశాలకు ఎగుమతి చేసే స్థాయిలో నాణ్యత ఉంటుంది. మామిడి, జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ తదితరాలకు ఎంతో ఉపయోగం.

– పి.రామాంజనేయులు, ఏడీ, ఉద్యాన శాఖ

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



మృతిచెందిన రజిత (ఫైల్)

నంద్యాల(బొమ్మలసత్రం): ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననే మనస్థాపంతో నంద్యాల పట్టణానికి చెందిన వేమూరి రజిత(16) ఉరేసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కాళికాంబ దేవాలయం వీధిలో నివసిస్తున్న శ్రీనివాసులు, కుమారి దంపతులకు కుమార్తె రజిత, కుమారుడు మేఘనాథ్ సంతానం. శ్రీనివాసులు స్థానిక బైర్‌మల్ వీధిలో స్టీల్ సామన్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తె స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతోంది. శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలు వెలువడటంతో ఇంటర్‌నెట్‌లో చూసుకునేందుకు వెళ్లింది. అక్కడ తాను ఫెయిల్ అయినట్లు తెలియడంతో దిగాలుగా ఇంటికి వచ్చింది. తల్లి కుమారి బయటకు వెళ్లడంతో ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరేవేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రజిత తల్లి కొంత సేపటి తర్వాత ఇంటికి రాగానే కుమార్తె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని కిందకు దింపారు. అప్పటికే రజిత మృతి చెందడంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు జరిపేందుకు శ్మశానవాటికకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బేతంచెర్ల: నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన విద్యార్థి మోడల్ స్కూల్లో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో వంశీ ఒక సబ్జెక్టు ఫెయిలయ్యాడు. మనస్థాపం చెందిన విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. బేతంచెర్లలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

తూనికలు కొలతల శాఖ అద్వితీయ పనితీరు

- కేసుల నమోదు, అపరాధ రుసుం వసూళ్లలో రాష్ట్రంలో రెండో స్థానం



చల్లా దయాకర్‌రెడ్డి, డిప్యూటీ కంట్రోలర్, తూనికలు, కొలతల శాఖ

కర్నూలు (న్యూటౌన్): అక్రమ మార్గాల ద్వారా ఆదాయాలను పెంచుకునే వ్యాపారుల గుట్టు రట్టు చేసి కేసులు నమోదు చేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో కర్నూలు తూనికలు కొలతల శాఖ అగ్రభాగాన నిలిచింది. ఏడాది కాలంలో ఏకంగా 5 వేల పైచిలుకు కేసులు నమోదు చేసి రూ.11.89 కోట్లను అపరాధ రుసుముగా వసూలు చేసి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆ శాఖ డిప్యూటీ కంట్రోలర్ చల్లా దయాకర్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన ' సాక్షి 'తో మాట్లాడుతూ ... తమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో విస్తృతంగా దాడులు నిర్వహించామన్నారు. ఇందుకు సంబంధించి గత ఏడాదికంటే అధికమొత్తంలో కాటాలకు ముద్రల రూపేణా రూ.11,89,62,518 కోట్లు వసూలు చేశామన్నారు. 2023 మార్చి 31 నాటికి ముద్రల రుసుం రూపేణ రూ.69,94,695 వసూలు చేశామన్నారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి రూ.73,56,341 వసూలు చేశామన్నారు. గతేడాది మార్చి 31వ తేదీనాటికి కేసుల రాజీ రుసుం రూ.37,89,500 ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి రూ.45,36,000 వసూలు చేసినట్లు చెప్పారు. గత ఏడాది కాటాలకు ముద్రలు లేకపోవడంతో 191 కేసులు నమోదయ్యాయని, ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి 200 కేసులు నమోదు చేశామన్నారు. గత ఏడాదితో పోల్చి చూస్తే తూనికలు, కొలతల శాఖ అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉందన్నారు.

రాయలసీమ రీజియన్‌లో...

రాయలసీమ రీజియన్‌లో కాటాలకు ముద్రలు వేసి గతేడాది రూ.6,22,73,815, ఈ ఏడాది మార్చి 31వ తేదీనాటికి రూ.6,81,28,677 కోట్లు వసూలు చేశామన్నారు. కేసుల రాజీ రుసుం గతేడాది రూ. 3,11,80,000 వసూలు కాగా ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి రూ.3,89,41,500 వసూలైందన్నారు. 2023లో 4,417 కేసులు నమోదు కాగా ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి 5,009 కేసులు నమోదు చేశామన్నారు. ముద్రల రుసుంలతో పాటు కేసుల నమోదు, రాజీ కేసుల్లో మంచి అభివృద్ధి సాధించామన్నారు. గతంలో రెవెన్యూ వసూళ్లలో రాయలసీమ రీజియన్ 4వ స్థానంలో ఉండేదని, ఏడాది రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచిందన్నారు.

వేడుకల సమయంలో అప్రమత్తంగా ఉండండి

- చిన్నటేకూరు వంటి ఘటనలు పునరావృతం కారాదు
- విద్యుత్ శాఖ ఎస్ఇ ఉమాపతి వెల్లడి

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న రోజుల్లో తిరుణాళ్లు, ఉత్సవాలు, జాతరలు, దేవర వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతాయని, విద్యుత్ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఎస్ఇ ఎం.ఉమాపతి తెలిపారు. కల్లూరు మండలం చిన్నటేకూరు సంఘటన నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. శుక్రవారం సాయంత్రం ఉమ్మడి జిల్లాలోని ఈఈలు, డీఈ, ఏడీఈ, ఏఇలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ సూచనలు ఇచ్చారు. ఇటువంటి కార్యక్రమాల్లో విద్యుత్ ప్రమాదాలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మారుమూల గ్రామాల్లో రథోత్సవాలు, ప్రభ ఊరేగింపులు, ఇతర వేడుకలు నిర్వహిస్తున్నా.. ఈ విషయాన్ని గ్రామస్థాయి సిబ్బంది తమ పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. పై అధికారుల దృష్టిలో పెట్టడం వల్ల మరింత అప్రమత్తంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఉత్సవాల సమయంలో గ్రామ పెద్దలు విద్యుత్ అధికారులతో సహకరించాలని పేర్కొన్నారు. రథోత్సవాలు, ప్రభల తయారీలో ఇనుము కాకుండా చెక్కను వినియోగిస్తే విద్యుత్ ప్రమాదాలకు తావు ఉండదని పేర్కొన్నారు. ప్రజలు కూడా ఇటువంటి వేడుకల గురించి ముందస్తుగా విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకరావాలని పేర్కొన్నారు. చిన్నటేకూరు వంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈలు ఓబులేసు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న టేకూరు జేఎల్ఎం, ఆపరేటర్ సస్పెన్షన్

కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో గురువారం ఆంజనేయ స్వామి ప్రభ ఊరేగింపు సమయంలో విద్యుత్‌షాక్ జరిగిన సంఘటనకు సంబంధించి ఇద్దరు విద్యుత్ ఉద్యోగులపై వేటు వేస్తూ ఎస్ఈ ఎం.ఉమాపతి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో ప్రభ ఊరేగింపు జరుగుతున్న విషయాన్ని జేఎల్ఎం రాజూనాయక్ తనపై అధికారుల దృష్టికి తీసుకురావాల్సి ఉన్నా... పట్టించుకోలేదని, అంతేగాక ప్రమాదం సమయంలో అందుబాటులో లేడని తెలిపారు. దీంతో ఈయనను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. చిన్నటేకూరు సబ్ స్టేషన్ ఆపరేటర్ మహేశ్వరుడును విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

వన్యప్రాణి వేటగాడు అరెస్ట్

ఆత్మకూరు: ముష్టపల్లి చెరువులో మణుబోతు(నీల్గాయిని)ను వధించి మాంసాన్ని విక్రయిస్తున్న వన్యప్రాణుల వేటగాళ్లను శుక్రవారం బైలూటి రేంజ్ ఆఫీసర్ సుభాష్ తమ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లకాలువ బీట్‌లో మూడు సంవత్సరాల వయస్సు కలిగిన మగ మనబోతును ఉచ్చులు వేసి వధించి మాంసాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బంది ద్వారా వెళ్లి దాడి చేశామన్నారు. ముష్టపల్లి సమీపంలో మాంసాన్ని విక్రయిస్తుండగా ఈశ్వరయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోగా, కృష్ణనాయక్, మధు, హనుమంతులు అనే వారు పరారయ్యారన్నారు. వీరు ముగ్గురు కూడా ముష్టపల్లి గ్రామానికి చెందిన వారిగా గుర్తించినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న ఈశ్వరయ్యను స్థానిక మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా ఆయన ఈనెల 26వ తేదీ వరకు రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. పారిపోయిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



మాంసం విక్రయిస్తుండగా వన్యప్రాణి వేటగాడిని అరెస్టు చేసిన అటవీ అధికారులు

మద్యం డంపులపై ప్రత్యేక నిఘా

- పాత నేరస్తులపై బైండోవర్ కేసులు
- సెబ్ జోనల్ డిప్యూటీ కమిషనర్ టి. విజయశేఖర్

కర్నూలు (టౌన్): రానున్న ఎన్నికల నేపథ్యంలో మద్యం డంపులపై నిఘా ఉంచాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జోనల్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ ఆదేశించారు. శుక్రవారం పంచలింగాల, సుంకేసుల, నంద్యాల చెక్‌పోస్టులను, ఎస్‌ఈబీ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. సెబ్‌స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. అనంతరం నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అనధికారిక మద్యం కేంద్రాలు, నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, నాటుసారా కేంద్రాలపై విస్తృతంగా దాడులు నిర్వహించాలన్నారు. నాటు సారాను పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్తులందరిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రధాన కింగ్ పిన్‌లను గుర్తించి వారిపై పీడీ యాక్ట్, జిల్లా బహిష్కరణ చేయాలన్నారు. అక్రమ మద్యాన్ని సరఫరా చేసే మార్గాల్లో రూట్ వాచ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఇతర జిల్లాల సిట్ అధికారులతో కలిసి అంతర్ జిల్లా దాడులు నిర్వహించాలన్నారు. చెక్‌పోస్టుల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్నూలు స్టేషన్ సెబ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, నరసా నాయుడు, మల్లిక, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నంద్యాల చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సెబ్ జోనల్ డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.87కోట్లు



భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీశైలం టెంపుల్: ఉగాది మహోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి తరలివచ్చిన భక్తులు ఉభయ దేవాలయాలలోని హుండీలలో సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూపేణా రూ.3,87,52,761 ఆదాయం లభించినట్లు దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు తెలిపారు. శుక్రవారం ఆలయంలోని అలంకార మండపంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 15 రోజులలో భక్తులు ఈ కానుకలను సమర్పించారు. నగదుతో పాటు హుండీలలో బంగారం 263 గ్రాముల 900 మిల్లీగ్రాములు, వెండి 9కేజీల700గ్రాములు లభించాయి. అలాగే యుఎస్ డాలర్లు 44, ఒమన్ రియాల్ 1, ఖత్తార్ రియాల్ 101, కువైట్ దినార్ 175, యుఏఈ దిర్హమ్స్ 5, సౌదిఅరేబియా రియాల్స్ 30, కెనడా డాలర్లు 20 మొదలైన విదేశీ కరెన్సీ కూడా హుండీ లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య, సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రవణమ్మ, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

జైన్ కంపెనీలో అగ్ని ప్రమాదం

- మంటల్లో కాలిపోయిన డ్రిప్, ప్లాస్టిక్ పైపులు.



గోదాములో ఎగిసిపడుతున్న మంటలు

జూపాడుబంగ్లా: జైన్ కంపెనీలో శుక్రవా రం ఉదయం 11 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించింది. గోదాము కు నిప్పు అంటుకొన్న విషయం గమనించిన జైన్ కంపెనీ సిబ్బంది మంటలను అదుపు చేయలేకపోయారు. విషయాన్ని ఆత్మకూరు ఫైర్ సిబ్బందికి తెలియజేయటంతో వారు హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయినా మంటలు అదుపుకాకపోవటంతో విషయాన్ని రీజనల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ జయన్న, ఆత్మకూరు ఫైర్ ఆఫీసర్ భీముడునాయక్ తెలిపారు. మూడు ఫైర్ ఇంజిన్లతో సంఘటనా ప్రాంతానికి చేరుకొని సుమారు ఆరు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో డ్రిప్, ప్లాస్టిక్ పైపులు కాలిపోయాయి. కంపెనీ చుట్టూ సోలార్ ఫిన్సింగ్ ఉన్నప్పటికీ పొలాల్లోని చెత్తాచెదారానికి రైతులు నిప్పుపెట్టడంతో అవికాస్త సోలార్ ఫిన్సింగ్‌ను దాటుకొని జైన్ కంపెనీలోని గోదాముకు వ్యాపించినట్లు పేర్కొంటున్నారు. గోదాముకు నిప్పు అంటుకొనే దాకా కంపెనీ సిబ్బంది గమనించకుండా ఉన్నారా అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్యాపిలి: ఏనుగుమర్రి గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందారు. వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరు గ్రామానికి చెందిన నారాయణ, నాగరత్నమ్మ కుమారుడు శివప్రసాద్ (22)డోన్‌లో యశోద ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నిషియన్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత పని నిమిత్తం గురువారం రాత్రి ద్విచక్ర వాహనంలో శివప్రసాద్ ఏనుగుమర్రికి వచ్చాడు. పని ముగించుకుని డోన్‌కు వెళ్లేందుకు ఎన్‌హెచ్ 44పై యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి అతి వేగంతో వచ్చిన లారీ ఢీ కొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అతన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. చేతికి వచ్చిన ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

కారు ఢీకొని వార్డ్‌బాయ్ దుర్మణం



మృతుడు ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

శిరివెళ్ల: నంద్యాల – ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై యర్రగుంట్ల వద్ద కారు ఢీకొని గుంప్రమాన్‌దిన్నెకు చెందిన కొమ్ము ప్రవీణ్ కుమార్ (24) దుర్మణం చెందారు. ఈ యువకుడు నంద్యాల పట్టణంలోని ఓ ఆస్పత్రిలో వార్డు బాయ్‌గా పని చేస్తున్నాడు. ప్రతి రోజు స్వగ్రామం నుంచి బైక్‌పై రాక పోకలు సాగిస్తున్నాడు. గురువారం రాత్రి డ్యూటి ముగించుకుని ఇంటికి తిరుగుప్రయాణమయ్యాడు. కాగా యర్రగుంట్ల సమీపంలో గుంప్రమాన్‌దిన్నెకు వెళ్లేందుకు రోడ్డు దాటి కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఎదురుగా ఆళ్లగడ్డ నుంచి నంద్యాల వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడి మృతితో కుటుంబీకులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. యువకుడు తండ్రి నాగన్న ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.